# మతాలు వేర్వైనా మాధవుడొక్కడే

## దూషణమును దూరముగా పెట్టి

ప్రేమభావములను పెంపు చేసి
సర్వమేకమన్న సద్బుద్ధి గలిగిన జనులే
భూమిని స్వర్గముగా మార్చగలరు

ప్రేమస్వరూపులారా! "సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియం." మొదటిది నైతికం, రెండవది ధార్మికం, మూడవది ఆధ్యాత్మికం. ఈ మూడింటి సమ్మిళిత స్వరూపమే మానవత్వం. అలలు లేని సముద్రమును చూడలేము, కిరణములు లేని సూర్యుని గాంచలేము. అలలు లేని సముద్రము సముద్రము కాదు, కిరణములు లేని సూర్యుడు సూర్యుడు కాడు. అదేరీతిగా ప్రేమ లేని మానవుడు మానవుడు కాడు. సముద్రమునకు అలలు ఎంత ప్రధానమో, సూర్యునికి కిరణములు ఎంత ప్రధానమో మానవునికి ప్రేమ అంత ఆధారము. కనుక మానవుడు ప్రేమజీవియై ప్రవర్తించాలి. ఎవరిపట్లా ద్వేషమును పూనరాదు, ఎవరినీ హింసించరాదు. భగవంతుడు హృదయవాసి అని తెలిపింది వేదము. దయతో కూడినదే హృదయం. అయితే, ప్రాకృతమైన వాంఛలచేత మానవునియందు మధ్యమధ్య కొన్ని ప్రవృత్తి లక్షణములు, వికారమైన భావములు ఆవిర్భవిస్తుంటాయి. దుర్గుణాలకు, దురహంకారానికి వాంఛలే మూలకారణం. అహంకారం ఉన్నచోట దయ నిలువజాలదు.

మానవుడు దేశకాలపరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి; కేవలం స్వార్థస్వప్రయోజనాల నిమిత్తం జీవించరాదు. వ్యష్టి, సమష్టి, సృష్టి, పరమేష్ఠి – ఈ నాల్గింటి సమ్మిళితస్వరూపమే ఈ ప్రకృతి. వ్యష్టి అయిన మానవుడు సమష్టితో చేరి సృష్టియందు పరమేష్ఠిని దర్శించటానికి ప్రయత్నించాలి. దీనినే జీసస్ కూడా చెప్పాడు – సమష్టితో చేరని వ్యష్టిజీవితం వ్యర్థమన్నాడు. 'యూనిటీ' (ఐకమత్యం) ఉన్నచోటే 'ప్యూరిటీ' (పవిత్రత) ఏర్పడుతుంది. 'ప్యూరిటీ' ఉన్నచోటే 'డివినిటీ' (దివ్యత్వం) ఆవిర్భవిస్తుంది. 'డివినిటీ' ఉన్నచోటే ఆనందం ప్రాప్తిస్తుంది.

srisathyasaivachanamrutam

పవిత్రహృదయులైన మనప్రాచీనులు భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించారు. కాని కలిప్రభావంచేత ఈనాటి మానవునికి ఏకత్వం ఏమాత్రం రుచించటం లేదు, భిన్నత్వాన్నే ఆశిస్తున్నాడు.

**భూతాకాశము - చిత్తాకాశము - చిదాకాశము**

మానవునియందు మూడువిధములైన ఆకాశములున్నాయని వేదాంతం బోధిస్తున్నది. మొదటిది భూతాకాశము, రెండవది చిత్తాకాశము, మూడవది చిదాకాశము. భూతాకాశము దేహసంబంధమైనది. దృశ్యకల్పితమైనదంతా భూతాకాశమే. కంటికి కనిపించే దృశ్యములన్నీ మార్పు చెందుతాయి. ఏదో ఒకనాటికి అవి అదృశ్యమైపోతాయి. పదార్థములతో, ప్రాణులతో, పంచభూతములతో కూడిన ఈ ప్రపంచమంతా భూతాకాశమే. నదులు, అడవులు, పర్వతములు, సూర్యచంద్రాదులు, Milky Way (నక్షత్ర వీథి) ... ఇవన్నీ భూతాకాశములో భాగములే. ఇంతటి విశాలమైన భూతాకాశమును చిత్తాకాశము మ్రింగివేస్తున్నది. అనగా చిత్తాకాశము ఇంకెంత విశాలమైనదో మీరు ఊహించుకోవచ్చును. ఇంతటి విశాలమైన, ఇంతటి ఘనమైన భూతాకాశము చిత్తాకాశమునందు చాలా చిన్నదిగా కనిపిస్తుంది. దృశ్యకల్పితమైన జగత్తు అంతయు చిత్తాకాశములో అణుమాత్రంగా ఇమిడి యున్నది. ఇదెట్లా సాధ్యమని మీరు సందేహించవచ్చు. మీరు పెద్దపెద్ద పర్వతాలను చూశారు; గొప్ప సముద్రాలను చూశారు; అనేక కోట్ల మైళ్ళ దూరంలో ఉన్న సూర్యచంద్రాదులను, నక్షత్రాలను చూస్తున్నారు. ఇవన్నీ మీ చిత్తంలో అణుమాత్రంగా నిలిచిపోయాయి కదా! దేహమును భూతాకాశంతోనూ, మనస్సును చిత్తాకాశంతోనూ పోల్చారు. ఈ రెండింటికీ ఆధారమైనది చిదాకాశము. భూతాకాశము - దేహము, చిత్తాకాశము - మనస్సు, చిదాకాశము - ఆత్మ. ఈ మూడింటి సమ్మిళితస్వరూపమే మానవత్వం.

మానవుడు "ఇది నా దేహము, నా మనస్సు" అంటున్నాడు. కాబట్టి వీటికంటే తాను ప్రత్యేకంగా ఉన్నాడు. తాను ఆత్మస్వరూపుడు, అన్నింటికీ మాస్టర్‌గా ఉన్నవాడు. అలాంటి మానవుణ్ణి అల్పునిగా భావించటం అజ్ఞానం. మానవుడు అల్పుడు కాదు, అనంత స్వరూపుడు. కాని, మీరు మానవత్వం చాలా అల్పమైనదని భావిస్తున్నారు. "ఆత్మ కనిపించటం లేదే!" అంటారు. ఆత్మకొక ప్రత్యేకమైన రూపం లేదు. ఇది ఒక కాలంలో ఉండి మరొక కాలంలో

srisathyasaivachanamrutam

అంతర్ధానం కాదు. ఇది ఎప్పుడూ మార్పు చెందదు. దీనినే వేదాంతం "నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త నిర్మలస్వరూపిణం" అని వర్ణించింది. జాగ్రత్, స్వప్న, సుషుప్తులకు మధ్యగల సంబంధమే భూతాకాశ, చిత్తాకాశ, చిదాకాశముల మధ్య ఉన్నది.

స్వప్నావస్థయందు చిత్తాకాశమును చూడవచ్చు. స్వప్నమునకు అతీతమైన సుషుప్తికి సంబంధించినది చిదాకాశము. అందులోనే మనకు ఆనందం ప్రాప్తిస్తుంది. గాఢనిద్రలో మనకెంతో హాయి కల్గుతుంది కదా! అనగా శాంతియే చిదాకాశముయొక్క ప్రధానమైన స్వరూపము. భూతాకాశము ప్రత్యక్షం, చిత్తాకాశము పరోక్షం, చిదాకాశము పవిత్రం. ఆత్మతత్త్వం ఎట్టి వికారములూ లేనిది, ఆకారమునకు అతీతమైనది. దీనినే వేదాంతం "శబ్దబ్రహ్మమయి, చరాచరమయి, జ్యోతిర్మయి, వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి" అని వర్ణించింది.

**...ఇంతకంటే గొప్ప సాధన మరొకటి లేదు**

ఆకారమునకు అతీతమైన ఆత్మతత్త్వాన్ని దర్శించాలని జీసస్ అనేక ప్రయత్నములు చేశాడు. బుద్ధుడు కూడా అంతే. "ఈ దృశ్యకల్పితమైన జగత్తును చూసి నేను మోసపోతున్నాను; దేహ సంబంధమైన బాంధవ్యములను చూసి నేను మురిసిపోతున్నాను. దేహము అనిత్యము, దృశ్యము అశాశ్వతము. "యద్దృశ్యం తన్నశ్యం" ఏది కనిపిస్తుందో అది ఏదో ఒకనాటికి కనిపించకుండా పోతుంది" అని తెలుసుకున్నాడు. అనేకమంది మహనీయులవద్దకు వెళ్ళి వారి బోధనలను ఆలకించాడు; అనేక గ్రంథములను పఠించాడు. కాని, అతనికేమాత్రం తృప్తి కల్గలేదు. భగవంతుడు ప్రసాదించిన పంచభూతాలను, పంచేంద్రియాలను సద్వినియోగపరచుకోవటమే నిర్వాణానికి మార్గమని గుర్తించాడు. ఈనాటి మానవుడు పంచేంద్రియాలను, పంచభూతాలను సద్వినియోగపరచుకోకుండా అనేక సాధనలు సల్పుతున్నాడు. ఈ సాధనలన్నీ వ్యర్థమైనవే. దృష్టిని, శ్రవణమును, వాక్కును, ఆలోచనలను పవిత్రంగా పెట్టుకోవాలి. ఇంతకంటే గొప్ప సాధన మరొకటి లేదు. జీసస్ కూడా ఇదే చెప్పాడు.

srisathyasaivachanamrutam

## మానవాళికి జీసస్ సందేశం

బెస్తవారందరూ జీసస్‌ను అనేక లౌకికమైన కోరికలు కోరుతూవచ్చారు. పీటర్ తనకు చేపలు అధికంగా లభించాలని కోరాడు. కాని తరువాత "ఛీ, ఇది కాదు నేను కోరవలసింది. జీసస్ బోధిస్తున్నట్లుగా దేహానికి, మనస్సుకు అతీతమైన తత్త్వాన్ని నేను గుర్తించాలి" అనుకున్నాడు. జీసస్ అందరికీ అదే చెప్పాడు. "ప్రజలారా! మీలో మీకు ఎందుకీ ద్వేషము? మీలో కరుణను నింపుకోండి. అందరినీ ప్రేమించండి, అందరినీ సేవించండి. అనేకత్వంలోని ఏకత్వాన్ని విశ్వసించండి" అని బోధించాడు. జీసస్ సందేశాన్ని అతని శిష్యులు తమకు తోచినట్లుగా వ్రాస్తూవచ్చారు. జీసస్‌ను శిలువ వేసినప్పుడు All are one, my dear son, be alike to everyone అని అశరీరవాణి వినిపించింది. తల్లియైన మేరీ దుఃఖిస్తుంటే, Death is the dress of life అన్నాడు. మరణమంటే దేహమనే డ్రస్సును మార్చుకోవటమే. ఈ 'డ్రస్సు' మారితే మరొక 'డ్రస్సు' వస్తుంది. మానవుడు ఎప్పటికీ ఒకే డ్రస్సులో ఉండడు కదా! ప్రతి దినమూ డ్రస్సులు మారుస్తుంటాడు. అదేవిధంగా, అనేక జన్మలు మారుతుంటాయి. అంతమాత్రమున దానిని మరణమని చెప్పకూడదు. మరణం కేవలం దేహానికి మాత్రమే సంబంధించినది. జీవతత్త్వం ఎప్పటికీ శాశ్వతంగానే ఉంటుంది. అదే అమృతత్వం. దానినే "బ్రహ్మానందం పరమసుఖదం..." అని వర్ణించారు.

జీసస్‌యొక్క శిష్యుల్లో మేథ్యూ అనే ఒక ట్యాక్స్ కలెక్టర్ ఉండేవాడు. అతడు బెస్తవారివద్దకు పన్ను వసూలు చేసే నిమిత్తం వెళ్ళేవాడు. ఆ బెస్తవారికి జీసస్ నిత్యమూ అనేక బోధలు చేయటం విని మేథ్యూ అవన్నీ వ్రాసుకొని బైబిల్‌ను రూపొందించాడు. జీసస్ ఎక్కడా తాను దైవాన్ని అనిగాని, గురువుననిగాని చెప్పుకోలేదు. God is my Father (భగవంతుడు నా తండ్రి) అని చెప్పేవాడు. అతని తత్త్వం చాలా పవిత్రమైనది. అతడు ఏకత్వాన్ని అనుభవించటానికి తగిన మార్గమును బోధిస్తూవచ్చాడు. భిన్నత్వానికి తాను ఏమాత్రం అవకాశమివ్వలేదు. అందరిలోనూ దైవత్వమున్నదని చెప్పాడు.

## దేహభ్రాంతిని వీడినప్పుడే అమృతత్వం సిద్ధిస్తుంది

దేహాలు వేర్వేరుగాని, అందరిలో ఉన్న ఆత్మతత్త్వం ఒక్కటే. కాబట్టి దేహభ్రాంతిని



sri sathyasaivachanamrutam

విడనాడండి. దేహాభిమానమున్నంతవరకు ఆత్మాభిమానం కల్గదు. అయితే మీరు దేహసంబంధమైన కర్తవ్యకర్మలను నిర్వర్తించవలసిందే. కాని ఇదే శాశ్వతమని భావించకూడదు. ఇవన్నీ కదలిపోయే మేఘాలవంటివి, మార్పు చెందుతూ ఉంటాయి. మార్పు చెందేది ఏదీ సత్యము కాదు. మార్పు చెందనిదే సత్యము. అదియే చిదాకాశము, అదియే ఆత్మ స్వరూపము! ఆత్మకు ప్రత్యేకంగా ఎట్టి రూపమూ లేదు. ఎట్టి రూపము కావాలంటే అట్టి రూపము ధరించవచ్చు. ఒక చిన్న ఉదాహరణ : ఒక తల్లికి నల్గురు కుమారులు. ఒకడు వచ్చి "అమ్మా! నాకు ఎఱ్ఱని జ్యూస్ కావాలి" అంటాడు. ఇంకొకడు "అమ్మా! నాకు పచ్చని జ్యూస్ కావాలి" అంటాడు. మూడవవాడు తనకు నల్లని జ్యూస్ కావాలంటాడు, నాల్గవవాడు తెల్లని జ్యూస్ కావాలంటాడు. తెలివి కలిగిన తల్లి ఏమి చేస్తుంది? ఒకే జ్యూస్‌ను మొదటివానికి ఎఱ్ఱని కప్పులో, రెండవానికి పచ్చని కప్పులో, మూడవవానికి నల్లని కప్పులో, నాల్గవ వానికి తెల్లని కప్పులో పోసిస్తుంది. కప్పులయొక్క రంగులు వేర్వేరుగాని, జ్యూస్ ఒక్కటే. దేహములన్నీ కప్పులవంటివి. వీటిలో ఉన్న ఆత్మ అనే మధురరసం ఒక్కటే. కనుక దేహాభిమానమును త్యజించి ఆత్మాభిమానమును వరించాలి. దేహాలు ఏనాటికైనా మార్పు చెందుతాయి. మార్పు చెందేదానిపై అభిమానం పెంచుకుంటే దుఃఖానికి గురి కావలసివస్తుంది.

దుఃఖనివారణ కావాలంటే అమృతత్వాన్ని అనుభవించాలంటే దేహభ్రాంతిని విసర్జించాలి. అయితే, ఉన్నంతవరకు దానిని గౌరవించాలి, సేవించాలి, కాపాడుకోవాలి. కాని, తరువాత దానిగురించి యోచించనక్కర్లేదు, దుఃఖించనక్కర్లేదు. ఎందుకోసం దుఃఖించటం? దుఃఖానికి మూలం అజ్ఞానమే. కాలం తీరినప్పుడు దేహం పోతుంది, ఈ 'కప్పు' మారిపోతుంది. కాని, లోపలున్న ఆత్మతత్త్వాన్ని విశ్వసించి, ఆనందాన్ని అనుభవించండి. జీసస్ ముఖ్యంగా బోధించింది ఇదే.

**"నేనే దైవం, నేనే దైవం..."**

అనేక వందల సంవత్సరాల క్రిందట జీవించిన ఒక మహనీయుడు నిరంతరం "నేనే దైవం, నేనే దైవం" అని అంటూ ఉండేవాడు. ప్రజలు అతని నొక పిచ్చివానిగా భావించేవారు. కొందరు పండితులు అతనిపట్ల ద్వేషం పూనారు. "ఇన్ని విద్యలు నేర్చిన మేమే దేవుళ్ళమని

sri sathyasai vahanamrutam

చెప్పుకోవటం లేదే! ఇతనికి ఎందుకింత అహంకారం?" అని అనుకున్నారు. కాని, సమదృష్టి లేని ఆ పండితులు రాజుదగ్గరకు వెళ్ళి అతనిగురించి ఫిర్యాదు చేశారు; అతనిని శిక్షించవలసిందిగా ఒత్తిడి చేశారు; లేకపోతే తాము రాజాస్థానమును వదలిపెట్టి వెళ్ళిపోతామని హెచ్చరించారు. అప్పుడు ఏమి చేయాలో చెప్పవలసిందని రాజు వారినే సలహా అడిగాడు. "నేనే దైవమని అంటున్నాడు కదా! కాళ్ళు కొట్టేయండి, చూద్దాం" అన్నారు ఆ పండితులు. రాజు వెంటనే అతని కాళ్ళు కొట్టేయించాడు. అప్పుడుకూడా అతను "నేనే దైవం, నేనే దైవం..." అని అన్నాడేగాని, ఏమాత్రం బాధకు గురికాలేదు. అతని శరీరంనుండి కారిన రక్తం కూడా "నేనే దైవం, నేనే దైవం..." అన్నది. అప్పుడు రాజు సత్యాన్ని గుర్తించి "జ్ఞానశూన్యులైన పండితుల మాటలు విని ఇంతటి పాపకార్యం చేశానే" అని పశ్చాత్తాపపడ్డాడు.

**అందరూ దైవస్వరూపులే**

జీసస్ జన్మించినప్పుడు ముగ్గురు వ్యక్తులు అతనిని దర్శించటానికి వచ్చారు. మొదటి వ్యక్తి జీసస్‌ను చూసి "ఇతను దైవాన్ని ప్రేమిస్తాడు" అన్నాడు. రెండవ వ్యక్తి "ఇతడు దైవప్రేమకు పాత్రుడౌతాడు" అన్నాడు. మూడవ వ్యక్తి "ఇతను దివ్యత్వంతో కూడినవాడు" అన్నాడు. జీసస్ ఏనాడూ తానే దైవమని చెప్పుకోలేదు. "నీకూ, నాకూ, అందరికీ దైవం ఒక్కడే. ఆ తండ్రి బిడ్డలమే మనమందరం" అని బోధిస్తూ వచ్చాడు. కాని, కొందరు జీసస్‌పట్ల ద్వేషం పూనారు. అయితే, జీసస్ సత్యమే చెబుతున్నాడని అర్చకులకు తెలుసు. కాని, తమ స్థానాన్ని కాపాడుకునే నిమిత్తం వారు జీసస్‌ను శిక్షించాలని అన్నారు. గవర్నరు జీసస్‌ను శిలువ వేయవలసిందిగా ఆదేశించాడు. కాని, తరువాత చాలా బాధపడ్డాడు. "ఛీ, నేనింతటి పాపకార్యమునకు పాల్పడ్డానా!" అని తనను తాను నిందించుకున్నాడు. రోమన్లు జీసస్‌ను మొట్టమొదట 'పర్సోనా' (Persona) అని పిలుస్తూవచ్చారు. రోమన్ భాషలో 'పర్సోనా' అనగా పవిత్రుడని అర్థం. Person (వ్యక్తి) అనే ఇంగ్లీషు పదం 'పర్సోనా' నుండియే ఏర్పడినది. ఇది అందరిలోనూ దివ్యత్వం ఉన్నదనే సత్యాన్ని సూచిస్తున్నది.

"సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం
సర్వతః శ్రుతిమల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి"

అందరూ దైవస్వరూపులే. ప్రతి జీవియందు దైవత్వమున్నది. పవిత్ర గ్రంథాలైన బైబిల్‌గాని, ఖురాన్‌గాని ఇదే సత్యాన్ని బోధిస్తున్నాయి. కాని, అర్థం చేసుకోలేని మూర్ఖులు పెడార్థాలు కల్పించి, ధర్మవిరుద్ధమైన మార్గంలో ప్రవేశిస్తున్నారు.

**"ఏక ప్రభు కే అనేక నామ్"**

"అద్వైత దర్శనం జ్ఞానం." "ఏకమేవాద్వితీయం బ్రహ్మ". రెండు కానటువంటిది, ఒక్కటే ఒక్కటి - అదే దివ్యత్వం. మీరు భజనలో "ఏక ప్రభు కే అనేక నామ్" అని పాడుతున్నారు కదా! భగవంతుడొక్కడే. కాని, ప్రాకృతమైన భావంచేత, ప్రవృత్తి తత్త్వంచేత మీరు భగవంతునికి అనేక రూపనామములను కల్పిస్తున్నారు.

అల్లాయంచు మహమ్మదీయులు జహోవాయంచు సత్క్రైస్తవుల్
ఫుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవులు శంభుండంచు శైవుల్ సదా
ఉల్లాసంబున గొల్వ నెల్లరను నాయుర్భోగభాగ్యాది సం
పల్లాభంబు లొసంగి బ్రోచు పరమాత్ముం డొక్కడే చూడుడీ!

అల్లా అని, జీసస్ అని, రాముడని మన ప్రీతి కొద్దీ మనం పేర్లు పెడుతున్నాముగాని, నిజానికి దైవం ఒక్కడే. జీసస్ ఇలా చెప్పాడు, రాముడు మరోలా చెప్పాడు, అని భావించటం కేవలం భ్రమ. మహనీయులందరూ పవిత్రమైన మార్గమునే బోధించారు; అందరూ క్షేమంగా ఉండాలని ఆశించారు. 'వీరిని నరకండి, వారిని చంపండి' అని ఏ మహనీయులూ చెప్పలేదు. కాని, ఇలాంటి ఘోరమైన అర్థాలను కల్పించుకొని కొందరు నేడు దుర్మార్గానికి పాల్పడుతున్నారు.

మహనీయులు పలికినవన్నీ పవిత్రమైన, ప్రీతికరమైన వాక్కులే. అందరినీ ప్రేమించమని బోధించారు. ఎవ్వరినీ ద్వేషించమని చెప్పలేదు. అందరియందూ ఉన్న ఆత్మ ఒక్కటే. ఎవరినీ చంపే అధికారం ఎవరికీ లేదు. భగవంతుడు పదిమందిని చంపమని చెబుతాడా? కొందరు భగవంతుని పేరిట ఇలాంటి దుర్భావములను పుట్టించి, దుర్మార్గంలో ప్రవేశిస్తున్నారు. ఇది ఎవరికీ మంచిది కాదు. ఇతరుల మనస్సును నొప్పించకూడదు. మీరు ఇతరుల మనస్సును నొప్పిస్తే మీ మనస్సు అంతకు పదిరెట్లు అధికంగా నొచ్చుకుంటుంది. మీరు ఇతరులను బాధిస్తే మిమ్మల్ని అంతకు పదిరెట్లు అధికంగా బాధించేవారుంటారు. మీకు మాట్లాడటానికి

srisathyasaivachanamrutam

ఇష్టం లేకపోతే మౌనంగా ఉండటం మంచిది. అంతేగాని, చెడ్డపలుకులు పలుకవద్దు. You cannot always oblige, but you can speak always obligingly.

**ప్రేమ పెరిగిన కొలదీ ఆనందం అధికమౌతుంది**

మీరందరూ ప్రేమస్వరూపులే. ఆ ప్రేమయే దైవం. అలలు లేనిది సముద్రం కాజాలదు. కిరణములు లేనివాడు సూర్యుడు కాజాలడు. అదేరీతిగా, ప్రేమ లేనివాడు మానవుడనిపించుకోడు. కనుక మీరు మానవత్వాన్ని పోషించుకోవాలంటే ప్రేమను పెంచుకోవాలి, దుర్భావములను త్రుంచివేయాలి. ఈనాడు చదువులు అధికమయ్యే కొలదీ మానవునిలో ప్రేమ శూన్యమై పోతున్నది; ద్వేషం అధికమౌపోతున్నది. విభేదాలను పెంచుకొని, యథార్థాన్ని మరచిపోయి అనర్థానికి గురి అవుతున్నాడు. మానవత్వాన్ని విస్మరించి పశువుగా మారిపోతున్నాడు. అసలు ఆధ్యాత్మికమంటే అర్థమేమిటి? పశుత్వాన్ని చంపి, మానవత్వాన్ని దైవత్వంగా మార్చుకోవటమే ఆధ్యాత్మికం. మానవుడు తనలో ఉన్న పశుత్వాన్ని చంపకుండా దివ్యత్వాన్ని పొందటానికి వీలుకాదు.

సంకుచితమైన ప్రేమవల్లనే మానవుడు పశువుగా మారిపోతున్నాడు. అలాంటి వానికి ఏనాటికీ ఆనందం లభ్యం కాదు. హృదయాన్ని విశాలం గావించుకోవాలి. ప్రేమను పెంచుకునే కొలదీ ఆనందం అభివృద్ధి అవుతుంది. ప్రేమస్వరూపులారా! ముఖ్యంగా మీరు గుర్తించవలసిందేమిటంటే, భగవంతుడు ప్రేమస్వరూపుడు. మానవుడూ ప్రేమస్వరూపుడే. కనుకనే, "దైవం మానుష రూపేణ" అన్నారు. పశువులందు కూడా దైవత్వమున్నది. కనుకనే, వాటి నోటినుండి "అంబా" అనే పదం వెలువడుతోంది. ప్రతి ప్రాణి యందు దైవత్వం ఉన్నది.

**పువ్వు పుట్టగానే పరిమళించినట్లు...**

జీసస్ తన బాల్యంలో ఒక పర్యాయం తల్లిదండ్రుల వెంట జెరూసలెంలో జరుగుతున్న తిరునాళ్ళను చూడటానికి వెళ్ళాడు. అక్కడ అనేక మంది గుమికూడారు. అంతవరకు తన వెంట ఉన్న జీసస్ ఉన్నట్లుండి కనిపించక పోయేసరికి తల్లి మేరీ ఎంతో ఆందోళన చెందింది. సాయంకాలం వరకూ తల్లిదండ్రులు జీసస్‌కోసం వెతుకుతూనే ఉన్నారు. చిట్టచివరికి, జీసస్ ఒక దేవాలయంలో కూర్చుని, అర్చకుడు చేస్తున్న ఆధ్యాత్మిక బోధను ఆసక్తిగా వింటూ



sri sathyasai vachanamrutam

కనిపించాడు. తల్లిని చూసి జీసస్ పరుగెత్తుకొని వచ్చాడు. మేరీ ఆనందబాష్పాలు రాల్చుతూ జీసస్‌ను దగ్గరకు తీసుకొని "నాయనా! ఇంతసేపు ఎక్కడున్నావు?" అని అడిగింది. జీసస్ "అమ్మా! నేను నా తండ్రియైన దేవునిదగ్గరే ఉన్నాను కదా! నీవెందుకు ఏడుస్తున్నావు? దేవుని దగ్గర ఉంటే ఎవరైనా ఏడుస్తారా?" అన్నాడు. ఆ రోజుల్లో జెరూసలెంలోని దేవాలయంలో పావురాలను బలి ఇచ్చేవారు. అలా ఇస్తే భగవంతుడు ప్రసన్నుడౌతాడని వారి ఉద్దేశ్యం. ఆ దురాచారాన్ని మాన్పించటానికి జీసస్ ఎంతో కృషి చేశాడు. అక్కడి అంగళ్ళలో ప్రవేశించి పావురాలన్నింటినీ వదలిపెట్టాడు. అందువల్ల కొందరు అతనిపై ద్వేషం పూని అనేకవిధాలుగా నిందించారు. కాని, జీసస్ వాటిని లెక్కచేయలేదు. నిందాస్తుతులు దేహానికే గాని, ఆత్మకు కావని భావించాడు.

## కలిలో స్మరణే తరణోపాయం

పాండవులు రాజసూయయాగం చేసినప్పుడు కృష్ణునికి అగ్రతాంబూల మిచ్చి సత్కరించారు. ఆ సమయంలో శిశుపాలుడు లేచి "కృష్ణా! స్నానంబు చేయు ఆ జవరాండ్ర చీరలు కాజేసినందుకా పూజ నీకు? గొల్లపూబోండ్లతో జల్లులాడిననాడు హర్షించినందుకా అర్ఘ్యమిడుట? చాలునిక, కట్టిపెట్టు పంచాంగమింక. పొగడుకొనబోకు, చాలించు, మూయి నోరు" అంటూ నోటికి వచ్చినట్లు మాట్లాడటం ప్రారంభించాడు. "ఛీ, ఇంత పెద్ద సభలో ఈ దుర్మార్గుడు నా కృష్ణుణ్ణి నోరుమూయి అన్నాడే!" అని ధర్మజుడు కన్నీరు కార్చాడు. అప్పుడు కృష్ణుడు తనకు అగ్రతాంబూలం పెట్టి ఇచ్చిన ప్లేటును శిశుపాలుని పైకి విసిరి అతనిని సంహరించాడు.

కృష్ణుడు చక్రాయుధంతో శిశుపాలుణ్ణి వధించాడని చాలామంది భావిస్తున్నారు. చక్రాయుధం కాదు, ఆ ప్లేటే అతని గొంతుకోసింది. అప్పుడు అతని శరీరం నుండి చిమ్మిన రక్తం కృష్ణుని పాదాలపై పడింది. అది చూసి ధర్మజుడు విస్మయం చెందాడు. "కృష్ణా! నిన్ను ఇంతగా దూషించిన ఆ దుర్మార్గుని రక్తం నీ పాదాలపై పడిందే! ఇది అన్యాయం. ఆ రక్తానికి నీ పాదాలను తాకే అర్హత లేదు" అన్నాడు. అప్పుడు కృష్ణుడు చిరునవ్వులు చిందిస్తూ "ధర్మజా! దూషణ, భూషణ, తిరస్కార, పురస్కారములు దేహమునకే గాని, ఆత్మకు కావు. ద్వేషంతో అయినప్పటికీ శిశుపాలుడు నిరంతరం నా నామాన్ని స్మరిస్తూ వచ్చాడు. అది ద్వేషమా,

srisathyasaivachanamrutam

ప్రేమనా అనేది నేను చూడను. నామాన్ని స్మరించటమే నాకు ప్రధానం. స్మరణే తరణోపాయం" అన్నాడు.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా

నామస్మరణతో మనం ఎంతటి ఘనకార్యమైనా సాధించవచ్చును. ఏ పని చేస్తున్నా, ఎక్కడికైనా ప్రయాణమై వెళుతున్నా నామస్మరణ చేయవచ్చును. జప, తప, ధ్యానాదులనాచరించాలంటే ఒక ప్రత్యేకమైన స్థలం కావాలి, కాలనియమాన్ని పాటించాలి. కాని, నామస్మరణకు కాలనియమం లేదు, ప్రత్యేకమైన స్థలమేదీ అక్కర్లేదు. "సర్వదా సర్వ కాలేషు సర్వత్ర హరిచింతనం" చేయాలి.

**భగవంతుడు ఎవ్వరినీ మరువడు**

ఇంతకుముందు 'మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి' సంస్థ ప్రతినిధి తన ప్రసంగంలో "స్వామీ! ఏనాటికీ మీరు మమ్మల్ని మరువకూడదు" అని అన్నది. భగవంతుడు మిమ్మల్ని మరచిపోతాడనుకోవటం కేవలం మీ 'ఇమేజినేషన్' (భ్రమ); అది మీ అంతర్భావముయొక్క 'రిఫ్లెక్షన్' రియాక్షన్, రీసౌండ్ మాత్రమే. ఇలాంటి భ్రమకు మీరు లోనుకాకండి. భగవంతుడు ఎప్పుడూ ఎవ్వరినీ మరువడు. మరచేది, జ్ఞాపకం తెచ్చుకునేది భక్తులే గాని, భగవంతుడు కాడు. భగవంతుడు అందరినీ ప్రేమిస్తాడు. కాబట్టి, ప్రేమను పెంచుకోండి, దుర్గుణాలను దూరం చేసుకోండి. కాని, ఈనాటి చదువులవల్ల పిల్లలయందు దుర్గుణాలు పెరిగిపోతున్నాయి. సాయిస్టూడెంట్స్ అలాంటివారు కారు. అయితే సాయిస్టూడెంట్స్ అని పేరు పెట్టుకొని మోసానికి పాల్పడేవారు కొంతమంది ఉన్నారు కాని, మా స్టూడెంట్లు మాత్రం చాలా పవిత్రమైన గుణములు కల్గినవారు. ప్రపంచంలో ఈనాడు చాలామంది స్వార్థస్వప్రయోజనములకోసం సాయి భక్తులమని చెప్పుకుంటున్నారు. అదికూడా స్వామికి ఆనందమే. నామస్మరణ చేయండి చాలు. దుర్గుణాలకు, దూషణకు అవకాశం ఇవ్వకండి. ప్రేమతో జీవించండి. ప్రేమయే దైవమని భావించండి.

**(25-12-2001 సాయంత్రం సాయి కుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vahini vachanamrutam